# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

**తేదీ: 28-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు**

## ముఖ్యాంశాలు

- లోక్ సభ రెండవ దశ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ను కేంద్ర ఎన్నికల సంఘం ఈ రోజు విడుదల చేసింది.

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.

- రాష్ట్రంలో మత్తు పదార్థాల సరఫరాపైన కఠినమైన నిఘాను పెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

- రాయలసీమ జిల్లాలలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లుగా వాతావరణ శాఖ పేర్కొంది.

========================

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా లోక్ సభకు ఏప్రిల్ 26న జరగనున్న రెండవ దశకు సంబంధించి నోటిఫికేషన్ ను రాష్ట్రపతి తరపున కేంద్ర ఎన్నికల సంఘం విడుదల ఈ రోజు విడుదల చేసింది. దీంతో నేటి నుంచి రెండో దశ నామినేషన్ల పర్వం మొదలైంది. ఈ దశ పోలింగ్‌కు నామినేషన్ పత్రాల దాఖలుకు ఏప్రిల్ 4 చివరి తేదీగా ఉంది. రెండవ విడతలో దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, 1 కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 88 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది.

========================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను భారత ఎన్నికల సంఘం నియమించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. 1987 బ్యాచ్ కి చెందిన రిటైర్డు ఐ.ఏ.ఎస్. అధికారి రామ్ మోహన్ మిశ్రాను స్పెషల్ జనరల్ అబ్జర్వర్ గా, 1984 బ్యాచ్ కి చెందిన రిటైర్డు ఐ.పి.ఎస్. అధికారి దీపక్ మిశ్రాను స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ గా మరియు 1983 బ్యాక్ కి చెందిన రిటైర్డు ఐ.ఆర్.ఎస్. అధికారి నీనా నిగమ్ ను స్పెషల్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వరుని గా నియమించినట్లుగా ఆయన తెలిపారు. ఈ ముగ్గురు రాష్ట్ర పత్యేక పరిశీలకులు వచ్చే వారం నుండి రాష్ట్రంలో పర్యటిస్తారని అన్నారు. అలాగే, ఎన్నికల నిర్వహణకు రాష్ట్రంలో చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను పరిశీలిస్తారన్నారు.

========================

రాష్ట్రంలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఎక్సైజ్ స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో, పోలీస్ శాఖ అధికారులతో ఆయన ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో మాదక ద్రవ్యాల సరఫరా,వాడకంపై ఉక్కు పాదం మోపాలని కోరారు. దీని కోసం సరిహద్దు రాష్ట్రాల డిజిపిల సమన్వయంతో వీటితో సంబంధం ఉన్న సూత్రధారులను గుర్తించి పిడి యాక్టు కింద అరెస్టు చేయాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగుచేసే గిరిజనులకు ఆపరేషన్ పరివర్తన కింద గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుకు ప్రోత్సహించాలని జవహర్ రెడ్డి ఆదేశించారు.

=========================

రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలలో వేసవి ఎండల ప్రభావం కనిపిస్తోందని వెల్లడించింది. రాయలసీమ జిల్లాలలోని నంద్యాలలో గడచిన ఇరవై నాలుగు గంటలలో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 41 డిగ్రీల సెల్సియస్ గా నమోదు అయిందని పేర్కొంది. వేడి ,తేమ అసౌకర్యమైన వాతావరణం కొనసాగనుందని తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్ యానంలో దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ గాలుల ప్రభావంతో కోస్తా జిల్లాలలో పొడి వాతావరణం కనిపిస్తోందని వివరించింది.

=========================

రాష్ట్రంలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి కోరారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పరిస్థితులపైన వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, జలవనరులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

=========================

విరామం

ఆంధ్రప్రదేశ్లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నాలుగవ షెడ్యూలును మ్యాప్ పాయింట్ల లో పొందుపరచడం జరిగిందని ఎన్నికల సంఘం పేర్కొంది. దీని ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18వ తేదీన వెలువడుతుంది. అలాగే నామినేషన్ల దాఖలుకు గడువు ఏప్రిల్ 25 వరకూ ఉంది. నామినేషన్ పరిశీలన ప్రక్రియ ఏప్రిల్ 26న ఉంటుంది. నామినేషన్ ఉపసంహరణకు గడువు ఏప్రిల్ 29న ఉంటుంది. పోలింగ్ మే 13 న నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు జూన్ నాలుగవ తేదీన ఉంటుందని ఎలక్షన్ కమీషన్ పేర్కొంది.

=========================

శ్రీశైలంలో ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకూ ఉగాది మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయని దేవస్థానం అధికారులు తెలిపారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైలం ఆలయంలో స్వామి అమ్మవార్ల అభిషేకాలు, కుంకుమార్చన పూజలు ఈ రోజు నుంచే నిలిపివేశారు. అలాగే, శ్రీశైలం దేవస్థానం వెబ్సైట్లో ఆన్ లైన్ సేవా టికెట్ల జారిని నిలిపివేసినట్లుగా అధికారులు పేర్కొన్నారు.

=========================

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలకు పాడేరు విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని
అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ కోరారు. జిల్లాలోని గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ఈ రోజు ఆయన సమావేశం నిర్వహించారు. ఈ

సందర్భంగా మాట్లాడుతూ, గిరిజన ప్రాంతం మారాలంటే విద్యార్థుల ఆలోచనా విధానంలో మార్పురావాలని అన్నారు. కాగా, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అవార్డులను, నగదు బహుమతులతో ప్రోత్సహిస్తామని చెప్పారు.

=========================

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అనుమతి పొందిన ఆయుధాలు కలిగిన వారందరూ వాటిని వెంటనే పోలీసు శాఖ వద్ద డిపాజిట్ చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల్లో శాంతి భద్రతల పర్యవేక్షణ, పోస్టల్ బ్యాలెట్ పై అవగాహన నిమిత్తం ఈ రోజు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా అనుమానితులను, గతంలో ఎన్నికల నేరాలతో సంబంధం ఉన్నవారిని బైండోవర్ చేయాలన్నారు.

=========================

జిల్లాలో కోకో పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. స్థానిక కలెక్టర్ బంగ్లాలో ఉద్యానవన అధికారులు, రైతులు,కోకో కొనుగోలు దారులు యాజమాన్యాలతో ఈ రోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేజి కోకో గింజల ధర ప్రస్తుతం 700 రూపాయలకు చేరిందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 32 వేల 451 ఎకరాల్లో పంటసాగు అవుతుందని 12 వేలు మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని అందిస్తుందని కలెక్టర్ వివరించారు.

=========================

రానున్న మూడు నెలలలో మంచినీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టరు కార్యాలయం నుంచి అధికారులతో మంచినీటి సరఫరాపై దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ, ప్రజలకు మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

=========================

చిత్తూరుజిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘునపై అందే ప్రతి అంశంపై చర్యలు చేపట్టడం జరుగుతుందని చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలియజేశారు. చిత్తూరుజిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఈ రోజు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘునకు సంబంధించి వచ్చే ప్రతి అంశంపై పరిశీలన జరుపుతున్నామని తెలిపారు.

=========================

ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని పాడేరు ప్రధమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి ప్రదీప కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఈ రోజు నిర్వహించారు.

=========================

=========================